క్లుప్తంగా

కార్మికుల కోసం నిరంతరం పోరాడుతా

భవన నిర్మాణ రాష్ట్ర కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు రాములు



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్ సమావేశంలో మాట్లాడుతున్న రాములు

మనోహరాబాద్(తూప్రాన్): భవన నిర్మాణ కార్మికుల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడతానని భవన నిర్మాణ రాష్ట్ర కార్మికుల సంఘం వర్కింగ్ అధ్యక్షుడు చెలిమెల రాములు అన్నారు. బుధవారం మండలంలోని కాళ్లకల్ బంగారమ్మ దేవాలయం వద్ద బీఎన్ఆర్ఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేశ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా వీరబోయిన సత్యనారాయణ, కుమ్మరి శ్రీనివాస్, క్యాషియర్‌గా ఎర్ర శ్రీనివాస్, ఆర్గనైజర్‌గా వెంకటేష్, నిరంజన్, సంయుక్త కార్యదర్శిగా శివశంకర్, సలహాదారుగా రామాచారి, సభ్యులుగా తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మేడే సందర్భంగా జెండావిష్కరణ చేశారు.

కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఉపాధి హామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మట్టి, పూడిక తీసివేత పనులు జరుగుతున్నాయి. ఉపాధిహామీ పనులను ఈజీఎస్ సిబ్బంది పరిశీలించి కూలీలకు పలు సూచనలు ఇచ్చారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కూలీ పనులపై అవగాహన కల్పించారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): నేడు సిద్దిపేట్‌లో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి బుధవారం కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సిద్దిపేటలో జరిగే సమావేశానికి అందరు హాజరై విజయవంతం చేయాలని, ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, అశోక్, పెంటయ్య, నాగరాజు, అన్వర్, అమరేందర్, రంగాచారి, నాగరాజుగౌడ్, రమేష్, మహేష్, సత్యనారాయణ, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



పార్టీలో చేరిన యువకులతో రఘునందన్‌రావు

నర్సాపూర్: మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు సమక్షంలో పలువురు యువకులు బీజేపీలో చేరారని బీజేవైఎం నాయకుడు అరివ్యంద్ చెప్పారు. బుధవారం రఘునందన్‌రావు సమక్షంలో నర్సాపూర్‌తో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు యువకులు తమ పార్టీలో చేరారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు బీజేపీ వైపు చూస్తున్నారని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అర్వింద్, బీజేవైఎం నాయకులు రాజేశ్, చారి, సురేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నగదు స్వాధీనం



కోళాపల్లి వద్ద నగదు రశీదును అందిస్తున్న పోలీసులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని 161వ జాతీయ ప్రధాన రహదారి కోళాపల్లి పాత టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి హర్‌ప్రీత్‌సింగ్ హైదరాబాద్‌కు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1 లక్షా పదివేలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ.శంకర్ బుధవారం తెలిపారు. ప్రజలు ఎన్నికల నేపథ్యంలో రూ.50 వేల కంటే ఎక్కువగా నగదును తమ వెంట తీసుకెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాచప్ప, హోంగార్డు రాజేందర్ తదితరులున్నారు.

ఘనంగా మేడే దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా బుధవారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సీపీఎం, సీపీఐ పార్టీలు, హమాలీ సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘం, ఆటో యూనియన్ల తదితర సంఘాల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో జెండాను ఎగురవేస్తున్న కార్మికులు



వెల్దుర్తిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



మనోహరాబాద్(తూప్రాన్): దండుపల్లి వద..



తూప్రాన్‌లో..



కొల్చారంలో ..



నర్సాపూర్ బస్టాండ్ సమీపంలో..



పెద్ద శంకరంపేటలో..



చేగుంటలో ..



పాపన్నపేటలో..



కౌడిపల్లిలో ..



రామాయంపేట (మెదక్): ప్రగతి ధర్మారంలో ..



నిజాంపేటలో..



టేక్మాల్(మెదక్): బొడ్మట్‌పల్లిలో ..

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

మనోహరాబాద్(తూప్రాన్): ఎంపీ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని జీడిపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం అందరం కలిసికట్టుగా పాటుపడాలని నాయకుడు శేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పురం మహేశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, మోంగ్యానాయక్, వెంకటేష్, కృష్ణ, సత్యనారాయణగౌడ్ తదితరులు ఉన్నారు.



జీడిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పండ్ల రసం తాగి ముగ్గురికి అస్వస్థత

రామాయంపేట(మెదక్): పండ్ల రసం తాగి ముగ్గురు అస్వస్థతకు గురైన ఘటన రామాయంపేటలో బుధవారం చోటు చేసుకుంది. బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన స్టాల్‌లో స్థానికులు ముగ్గురు పండ్ల రసం తాగిన కొద్ది సేపటికే వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని చికిత్స నిమిత్తం ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వీరిలో ఒకరిని హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు బాధితులను విచారించి, సదరు స్టాల్‌ను మూసివేయించారు.



చికిత్స పొందుతున్న వ్యక్తితో మాట్లాడుతున్న పోలీసులు

యువగర్జన సభను విజయవంతం చేయండి

టేక్మాల్(మెదక్): జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపించాలని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంగమేశ్వర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. రేపు ఆందోల్ నియోజకవర్గం వట్‌పల్లి మండల కేంద్రంలో జరగబోయే యువగర్జన సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిద్దు, మండల ఉపాధ్యక్షుడు ఖాజా, వివిధ గ్రామాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యదర్శులు సంగమేశ్వర్, హరిప్రసాద్, మహేశ్‌రెడ్డి, శ్రీకాంత్, కుమార్ యాదవ్, బాబు, శ్రీకాంత్, నవీన్, సాయి శేషుగౌడ్, రియాజ్, మహేశ్, శ్రావణ్, భూషణ్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంగమేశ్వర్‌గౌడ్

చికిత్స పొందుతూ మహిళ మృతి



భూమమ్మ(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): భర్త మందలించాడని భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రం హవేళిఘణాపూర్‌కు చెందిన భూమమ్మ(54) సోమవారం భర్త పోచయ్యతో గొడవపడి పురుగుల మందు తాగింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటికి కరెంట్ మీటర్ బిగించలేదని..

వాటర్ ట్యాంక్ ఎక్కి హల్‌చల్



వాటర్ ట్యాంక్‌పై యువకుడు

మనోహరాబాద్(తూప్రాన్): నూతన ఇంటికి కరెంట్ మీటర్ బిగించడం లేదని యువకుడు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపిన సంఘటన మండలంలోని కాళ్లకల్‌లో చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహ్మద్ సయ్యద్ తన ఇంటికి మీటర్ కోసం ఏడాది క్రితం డీడీ కట్టాడు. అయితే సిబ్బంది ఇప్పటి వరకు మీటర్ బిగించకపోవడంతో కార్యాలయం చుట్టూ తిరిగారు. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంతో బుధవారం వాటర్ ట్యాంక్ ఎక్కి మూడు గంటలు హల్‌చల్ చేశాడు. స్థానికులు నచ్చజెప్పినా.. కిందకు దిగలేదు. చివరికి ఏఈ కృష్ణ ఆదేశాలతో సిబ్బంది మీటర్ బిగించడంతో కిందకు దిగాడు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలో మంచినీటి సమస్య పరిష్కారానికి మిషన్ భగీరథ జిల్లా అధికారులు స్పందించారు. బుధవారం 'సాక్షి' లో గొంతెండుతుంది కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్ వద్ద నీటి సరఫరా జరుగుతున్న తీరును పరిశీలించారు. మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ కమలాకర్, డీఈఈ శ్రీనివాస్, సంపత్, ఏఈలు తిరుమలేశ్, నిఖిల చిన్నశంకరంపేట ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంక్‌కు భగీరథ పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు లైన్ క్లియర్ చేశారు. ఇక ముందు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వీరి వెంట మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ దామోదర్ ఉన్నారు.



నీటి సరఫరాను పరిశీలిస్తున్న మిషన్ భగీరథ ఈఈ కమలాకర్, డీఈఈలు, సిబ్బంది

పది ఫలితాల్లో గీతా విద్యార్థుల జయకేతనం



విద్యార్థులతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

తూప్రాన్: పదో తరగతి ఫలితాల్లో తూప్రాన్ గీతా స్కూల్ విద్యార్థులు మరోసారి సత్తా చాటారని పాఠశాల కరస్పాండెంట్ పి.రామాంజనేయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు పదికి పది జీపీఏ సాధించగా, మరో పదిహేను మంది విద్యార్థులు 9.8 జీపీఏ సాధించారని తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్, చైర్‌పర్సన్ పి.ఉష, ప్రిన్సిపాల్ సి.హెచ్.వెంకటకృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేంరాజ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. తమ పిల్లలు సాధించిన అత్యుత్తమ ఫలితాలపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉన్నారు.

రఘునందన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

ఉపాధిహామీ పనుల వద్ద బీజేపీ ప్రచారం



మనోహరాబాద్(తూప్రాన్): ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు తమ ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ నాయకులు కోరారు. మండలంలోని జీడిపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు ఉపాధిహామీ పనుల వద్ద ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, నాయకులు సత్యనారాయణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీ ప్రచారం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుధవారం మండలంలోని రాజిపేటలో ఉపాధిహామీ పనుల వద్ద మండల ప్రధాన కార్యదర్శి నాగయ్య, కార్యకర్తలతో కలిసి బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావ్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ అభివృద్ధి పనుల కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీతోనే దేశభవిష్యత్ బాగుంటుందని చెప్పారు.



ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా రంగంపేట బస్టాండ్ ఆవరణ

భానుడి భగభగ

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతోంది. దీంతో ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండను తట్టుకోలేక ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. మరోవైపు ఉక్కపోతతో తట్టుకోని పరిస్థితి కనిపిస్తోంది. వాతావరణంలో అధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరగడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉక్కపోత నుంచి ఫ్యాన్లు, సాధారణ కూలర్లు ఉపయోగించే జనం వాటి నుంచి చల్లని గాలికి సేద తీరుదామన్న వేడిగాలి వస్తుందని వాపోతున్నారు. చెట్ల కింద సేద తీరు దామన్న వడగాలులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

తాగిన మైకంలో దాడి

– చికిత్స పొందుతూ ఒకరి మృతి

తూప్రాన్: తాగిన మైకంలో ఇద్దరు స్నేహితులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ శివానందం పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. వర్గల్ మండలం మీనాజీపేటకు చెందిన బాణపురం యాదగిరి, కీసర ఆనంద్ (50) ఇద్దరు స్నేహితులు. గత నెల 22వ తేదీన ఆనంద్ తన బైక్ రిపేర్ ఉందని యాదగిరితో కలిసి తూప్రాన్‌కు వెళ్లారు. బైక్ రిపేర్ అనంతరం మద్యం సేవించిన ఇద్దరు, ఏం జరిగిదో తెలియదు కాని అల్లాపూర్ శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో ఇద్దరు గొడవ పడ్డారు. ఆనంద్‌పై యాదగిరి దాడికి పాల్పడ్డాడు. కాసేపటికి ఇద్దరు కలిసి తిరిగి బైక్‌పై మీనాజీపేటకు బయలుదేరారు. ఆనంద్‌పై కక్ష తీర్చుకోవాలన్న ఉద్దేశంతో కొద్ది దూరం వెళ్లిన అనంతరం మూత్రవిసర్జన కోసం బైక్‌ను ఆపమని చెప్పిన యాదగిరి, ఆనంద్‌పై దాడికి పాల్పడి తీవ్రంగా గాయపర్చాడు. అనంతరం ఆనంద్ కుటుంబ సభ్యులకు రోడ్డు ప్రమాదంతో ఆనంద్‌కు తీవ్రగాయాలు అయ్యాయని సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని ఆనంద్‌ను ఆసుపత్రికి తరలించారు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదం జరిగితే ఇద్దరికి గాయాలు కావాలి. కాని ఒక్కరికే ఎలా గాయాలు అవుతాయని అనుమానంతో గతనెల 23న గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించారు. పెద్దల సమక్షంలో యాదగిరి దాడికి పాల్పడినట్లు అంగీకరించినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.



మృతి చెందిన ఆనంద్ (ఫైల్)

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్‌లో చేరికలు



నర్సాపూర్: బీఆర్ఎస్‌కు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారని తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాసాయిపేట యువకులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకుంటున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పార్టీ నాయకులు సుహాసినిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ సురేష్ షెట్కార్‌ను గెలిపించాలి

పెద్దశంకరంపేట(మెదక్): జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాయిని మధు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని కొత్తపేట, రామోజిపల్లి తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని, చేతి గుర్తుకే ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు నారాగౌడ్, సంగమేశ్వర్, బాసాడ రాజు, భానుగౌడ్, అనంతరావు, రాంచందర్, శంకరయ్య, అశోక్ తదితరులున్నారు.

◆ బీఆర్ఎస్‌లో చేరికలు

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని హన్మంతపూర్‌కు చెందిన కొందరిని మోస పూరితంగా కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని వారందరు తిరిగి బుధవారం బీఆర్ఎస్‌లో చేరారని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. తమ పార్టీ కార్యకర్తలకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని ఆయన ఆరోపించారు. ప్రజలతో తాను సమావేశమై చర్చించగా వారు మోస పోయినట్లు తెలుసుకొని తిరిగి బీఆర్ఎస్‌లోకి వచ్చారని వివరించారు.

◆ బీజేవైఎం నాయకుల ప్రచారం



నర్సాపూర్ రూరల్: మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా బీజేవైఎం నాయకుడు వల్దాస్ అరవింద్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని నత్నయ్యపల్లి, కాగజ్ మద్దూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి చూసి బీజేపీకి ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు చారి, సురేశ్, ప్రవీణ్, పోతరాజు అనిల్, ఉదయ్‌గౌడ్, వేణుగౌడ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎల్లమ్మకు బోనాలు

రామాయంపేట(మెదక్): మండలంలోని దంతేపల్లి గ్రామంలో ఎల్లమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా బీఆర్ఎస్ నాయకులు పూజలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఇతర నాయకులను గ్రామస్తులు సన్మానించారు. గ్రామంలో నిర్వహించిన బోనాల ఊరేగింపులో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదగిరి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నాగరాజు, కాట్రియాల మాజీ ఎంపీటీసీ శ్యాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ వైభవంగా వేంకటేశ్వర కల్యాణం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలను చేసి కల్యాణం జరిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు వాసుదేవచారి, బచ్చు సురేశ్, హన్మయ్య, నగేశ్, రాములు, భక్తులు పాల్గొన్నారు.

◆ షాట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలో ఏశం మల్లేశం ఇల్లు షాట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో నిత్యావసర సరుకులు, ఫ్రిడ్జ్, టీవీతో పాటు సుమారు రూ.40 వేలు నగదు కాలి బూడిదయ్యాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

◆ గుర్తు తెలియని వ్యక్తి మృతి

నర్సాపూర్‌రూరల్: మండలంలోని కొండాపూర్ శివారులోని రాజుగారి భూమి వద్ద మర్రిచెట్టు కింద గుర్తు తెలియని మగ వ్యక్తి మరణించినట్లు నర్సాపూర్ ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. మృతుడి వయస్సు 50 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. అతడికి సంబంధించిన వ్యక్తులు ఎవరైన ఉంటే నర్సాపూర్ పోలీసులకు 87126 57941 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు.